# సరికొత్త కథ

పాతికేళ్ళ నుంచి టంచనుగా పదిగంటలకే ఆఫీసుకు రావడం అలవాటయిన జగన్నాథం వచ్చేసరికి - శ్యాంబాబుకూడ వచ్చి సీట్లో కూర్చున్నాడు...

జగన్నాథం తనకు కలిగిన ఆశ్చర్యం దాచుకున్నాడు. కానీ శ్యాంబాబే యేదో క్షమాపణ చెప్పుకుంటునట్లు.... "నేను కూడ మిమ్మల్ని "యిమిటేట్" చేస్తున్నాను గురూగారూ!" అన్నాడు.

"థాంక్స్! శ్యాంబాబూ! నేను రిటైరై పోతే, నా "పోస్టు నీకు రికమెండు చేసి మరీ పోతాను. సరేనా?" అన్నాడు జగన్నాథం - అతని మాటల్లో చిత్తశుద్ధి ధ్వనించింది.

"అంతమాటనకండి!... మీరింకా నాలుగేళ్ళు సర్వీసులో వుంటారు... అందాకా నేనెన్నో నేర్చుకోవాలి మీదగ్గర" - అంటూనే శ్యాంబాబు - అప్పుడే లోపలికి వస్తూ ఎదురయిన కాంట్రాక్టర్ శివరామయ్యను చూస్తూ "రండి! రండి! శివరామయ్యగారు" - అంటూ కూర్చోమని కుర్చీ చూపించాడు.

శివరామయ్య తన ఉంగరాల చేత్తో జరీకండువా తీసి మొహాన పట్టిన చిరు చెమటని తుడుచుకొని... "శ్యాంబాబు గారు! యీ మధ్య మీక్కూడ పెందరాళే తెల్లారుతున్నట్లుందే" అన్నాడు.

అతను నవ్వి నప్పుడు కారాకిల్లీ గారపళ్లు స్పష్టంగా కనబడ్డాయి. అతను తొడుక్కున్న సిల్కు చొక్కాజేబులో నుంచి బరువైన మనీపర్సు మీద నుంచి తన దృష్టిని బలవంతంగా మరల్చుకొని శ్యాంబాబు.

"మరే! ....చెప్పండి" అంటూనే ఫైలు తీసి పని చేసుకోవడం ప్రారంభించాడు.

"చాల్లేవయ్యా! నటన... మీ హెడ్‌క్లార్క్ మరీ పీకనులిమీడు గాని... పద... పద... పెసరట్టూ ఉప్మాకొట్టేసి వద్దాం" అన్నాడు శివరామయ్య - తన వుంగరాల చెయ్యి బల్లమీద వుంచి కాస్త నెమ్మదిగా జెగన్నాథం చెవిని పడకుండా

"క్షమించాలి శివరామయ్యగారు నేనీమధ్య ప్రొద్దున్నపూట భోజనం చేసి వస్తున్నా" నన్నాడు శ్యాంబాబు.

"అయితే సరే యిదుగో స్లిప్పు" అంటూ చిన్నకాగితం ముక్క అందించాడు కాంట్రాక్టరు.

నిగ్రహంగా దానివేపు చూశాడు శ్యాంబాబు దాని మీద కాంట్రాక్టరు గారి పెండింగు బిల్లు నెంబరు వగైరా వేసి వున్నాయి....

"సారీ! మీ కాయితాలు వెళ్లటానికి మరో టూ వీక్స్ పట్టవచ్చును" అన్నాడు శ్యాంబాబు.

"వోయబ్బో! నే చచ్చిపోతాను ఈ లోగా! రెండు వారాలు కాదు, నువ్వు తల్చుకుంటే రెండు గంటల్లో వెళ్తాయి... నీకష్టం వుంచుకోను..." అని శివరామయ్య బ్రతిమాలుతూనే కన్ను కొట్టాడు.

"బల్ల క్రింద పులిబుర్ర పెడతానులే" అన్నాడు.

"కాని మేం బల్ల క్రింద చేతులు పెట్టడం మానేశామే!' శ్యాంబాబు మాటతుంచేశాడు.

శివరామయ్య వేళాకోళంగా నవ్వి - "సత్తె ప్రమాణంగా"? అన్నాడు.

"ప్లీజ్! నన్ను పనిచేసుకోనివ్వండి. మీ క్కావాలంటే లోపలికి పోయి మా ఆఫీసర్‌ని చూడండి' ' అన్నాడు కోపంగా శ్యాంబాబు.

అతని మాటల్లోని నిజాయితీని కాంట్రాక్టర్ గమనించి', "అయితే నువ్వూ చెడిపోయావన్న మాట" అన్నాడు కసిగా.

"ఏం! ఎందుకు కూడదు?... నేనూ బాగుపడ్డాను... అటు చూడండి! హెడ్‌క్లార్క్ జెగన్నాధం గారు. అతనికి పెళ్లీడు కూతురుంది.. డిగ్రీ వున్నా వుద్యోగం లేని కొడుకున్నాడు... ఆయన ఈ వుద్యోగంలో రజతోత్సవం చేసుకున్నాడు, కాని అద్దె కొంపలోనే వుంటున్నాడు... అలాంటిది ఆయన యివాల్టి దాకా కష్టార్జితమే కాని. యితరత్రా పైసా ముట్టలేదు... నేను కుర్రాణ్ణి... నిన్న గాక మొన్న పెళ్ళి అయిన వాణ్ని... నేను... నేను... మాత్రం నిగ్రహంగా బ్రతకలేనా?" అని

"ఐ.సీ.! యిదంతా కొత్తగాలి మహిమ అన్నమాట సరే! నేను చూస్తా - ఆకలి వేస్తే పచ్చగడ్డి కోసం పరిగెత్తని గాడిదలు ఎన్నాళ్లుంటాయి..." అని విసురుగా లేచిన శివరామయ్యని చూసి శ్యాంబాబు, "ఇదుగో! మీ గడ్డి తీసుకుపోండి మరిచిపోయారు...మేం మునుపటి రేటు కన్నా చాలాచవగ్గా దొరుకుతున్న అక్కుళ్ల బియ్యం తింటున్నాం... గడ్డి కాదు... అంటూ తన బల్లమీద చిన్నమడత పెట్టి శివరామయ్య వుంచిన వందరూపాయల కాగితాన్ని శివరామయ్య చేతిలో పెట్టి చెయ్యి గిల్లి మరీ పంపించేశాడు.

జెగన్నాధం గారీ సన్నివేశాన్ని తన పనిలో నిమగ్నమై వుంటూనే లీలగా గమనించి, ఎంతో ప్రసన్నుడైనాడు గాని, అతని వెన్నెముకలో నుంచి జర్రున భయం జారింది.

ఇందాకా తనన్న రిటైర్‌మెంట్ అన్నమాట అతనికి సొంతంగా గ్రుచ్చుకున్న విచ్చుకత్తి లాగ గుండెలో నాటుకుంది.

అమ్మాయి "కల్పన"కి పెళ్లి చేయాలి.. కట్నాలు వద్దన్న చట్టం వచ్చింది... ఆడామగా ఒకటే - సంఘంలో యిద్దరి ప్రతి పత్తీ వొకటే నన్న బోధన గవర్నమెంటు చేస్తూనే వుంది. కానీ, కట్నం కాకపోతే

'కానుక' అదిగాకపోతే లాంఛనం యేదో ఒక పేరుతో వో ఏభయివేలైనా 'తగ'లెట్టందే ఆడ పిల్లని మరో అయ్య చేత పెట్టడం సాధ్యం కావటం లేదే.. పోనీ అబ్బాయి రామం చేతి కందాడా? అంటే అదీ లేదు.. వాడికి బియ్యస్సీ డిగ్రీవుంది.. మంచి వుద్యోగం - అయిదొందలు వచ్చే వుద్యోగం వస్తే తప్ప చెయ్యలేనంటాడు - అయితే ఒక "అయిడియా" వుంది... అలా చేస్తే బాగే కాని దానికి జగన్నాథం గారి భార్య సరస్వతమ్మ ఒప్పుకోవడంలేదు.

నిజంగా విచిత్రమైన మనిషి సరస్వతమ్మ... సామాన్యంగా మగాళ్లు మారినంతగా ఆడాళ్లు 'మారరు' - వాళ్లు పాత బూజు పట్టిన భావాల్నే పట్టుకు వ్రేళ్లాడుతుంటారు - అంటారుగాని సరస్వతమ్మగారి సంగతి వేరు... అట్లాగని ఆవిడ క్లబ్బులకి, సభలకీ వాటికీ పోయి వుపన్యాసాలు గట్రా యిచ్చే మనిషికాదు "నాకో కూతురుంది... ఓ కొడుకున్నాడు. కొడుక్కు మాత్రం కట్నం తీసుకొని పెళ్లి చెయ్యను. కూతురు సంగతి కూడా ప్రయత్నిస్తానంటుంది ఆమె."

అక్కడే జగన్నాథం అయిడియా ఫలించదు... నీకేం పోయింది... నువ్వు అలాగే అంటావు కాని మన రామం కట్నం తీసుకోపోతే మాత్రం మన కల్పనకి కట్నం లేని వరుడెలా వస్తాడు?... అందుకనే యిస్తినమ్మ వాయనం పుచ్చుకుంటినమ్మ వాయినం అన్నట్లు - రెండు పెళ్లిళ్ల చేసివెయ్యాలంటాడాయన...

సరస్వతమ్మగారంటుంది... "నిజంగా మీ మనస్పొప్పుతుందండీ? యివాల్టిదాకా నిజాయితీగా బ్రతుకుతూ - అమ్మయ్య! యిన్నాళ్లకి యీ దేశంలో నాలాగే లంచాలు పట్టకుండా బ్రతకడానికి యింకా ఎందరికో ప్రభుత్వం చలవవల్ల ఛాన్సు వచ్చింది-" అన్న మీరేనా? యిలా అంటున్నారు"" -అంటుంది నవ్వుతూ.

జగన్నాథం భార్య మాటలనే మననం చేసుకుంటూ - 'నేను అదృష్ట వంతుణ్ణి - అభ్యుదయ భావాలుగల పెళ్లాం దొరికింది" అని మురిసిపోతాడుకాని పరిస్థితులతన్ని కృంగదీస్తూంటాయి... దాంతో కొంత ప్రాక్టికల్‌గా ఆలోచించి మళ్లీ అంతలోనే సర్దుకుని - "నో, యిన్నాళ్లు ప్రిన్సిపల్‌గా వున్నాను. యిప్పుడూ అంతే-కుర్రాడికి రికమెండేషన్ లేకుండానే ఉద్యోగం - అమ్మాయికి కట్నం యివ్వకుండానే వివాహం - అంతే" అనుకున్నాడు. "అంతే" నన్నమాట అప్రయత్నంగా బయటికి అనేశాడు... అంతలో అక్కడికి టెలిగ్రాం తీసుకుని వచ్చిన తపాలా జవాన్... ఏమిట్సార్! అంతే నన్నారు నన్నుచూసి?" అంటూ తంతి అందించాడు.

"ఓ! నాకేనా? టెలిగ్రాం! ... యిదేమిటయ్యోయ్; యింత తొందరగా వచ్చేసింది.. యివాళ యిచ్చిందేనే.. మాబామ్మర్ది యిచ్చాడు" అంటూ సంతకం చేశాడు.

"అంతేసార్! "అంటూ పోస్టుమాన్ హుషారుగా వెళ్ళిపోయాడు.

"అంతే మరి" అనుకున్నాడు నిర్లిప్తంగా టెలిగ్రాం చదువుకుని... సరస్వతమ్మగారి తమ్ముడు కృష్ణమూర్తి వస్తున్నాడు...కృష్ణమూర్తికి కొడుకూ, కూతురూ పెళ్ళీడు వాళ్ళున్నారుకానీ అతనుకొడుకు పూసెత్తడు... ఒక కూతురుంది పదహారేళ్లది. దానికి సంబంధాలు వెతుక్కుంటూ తన యింటిమీద వచ్చి

పడతాడు... అంతేమరి అనుకున్నాడు జగన్నాథం!

అయితే ఎప్పుడూ వచ్చే మూర్తి ఈసారి టెలిగ్రాం యిచ్చాడు ఎందుకూ? అనుకుని...ఔనౌను మేమీమధ్య యిల్లు మార్చేశాంకదా... వాడికి కొత్తయింటి అడ్రసు కూడా రాయలేదు... అందుకే-సుఖపడ్డం అలవాటైన ప్రాణి కనుక స్టేషనుకు రమ్మనమని టెలిగ్రాం యిచ్చాడు సర్లే పోదాం... ఎంతైనా ఆలి తమ్ముడు కదా అనుకున్నాడు.

సాయంకాలం రైలుస్టేషన్ మీదుగా బయలు దేరాడు యింటికి జగన్నాథం... బామ్మర్దిని తీసుకుపోవాలిగా.

రిక్షా ఎక్కాడు. చాలా వుషారుగా వున్నాడు ఆ రిక్షా కుర్రాడు. బండి గజ్జెల గుర్రంలా మెరిసిపోతోంది!

"సైకిల్‌రిక్షా లైసెన్సులు" తీసిపారేశాక మీ పని బాగుందయ్యా! ఔనా? అన్నాడు జగన్నాథం. మంచి సీటున్న రిక్షా సుఖాన్ని అనుభవిస్తూ ఆ కుర్రాడితో.

"అంతేనా? మీరు చూశారు! బండెనకాతల బ్యాంకి పేరుంది చూడండి. ఈ బండి నా సొంతం... బ్యాంకివాళ్లిచ్చారు" అన్నాడు రిక్షా అబ్బాయి.

"అదా సంగతి! మరి బాకీ తీర్చగా, మీకేం మిగులుతుందయ్యా?

"ఎంత మాటన్నారు? కాళ్లల్లో శక్తి వుండాలే గాని... ఒకరి బాధలేని మంచి ఉద్యోగం యిదే అనుకోండి" అన్నాడా అబ్బాయి.

దళారుల బాధ లేదు... వేళకి వచ్చాను రాలేదు అన్న యజమాని యిబ్బంది లేదు. రిక్షా తొక్కడం వెట్టి చాకిరీ కాదు. బానిసత్వం అంతకన్నా కాదు... యంత్ర లాభమున్న పని...

ఆ రిక్షా అబ్బాయి యువకుడు, ప్యాంటు చొక్కా వేసుకున్నాడు. కాలికి చెప్పులున్నాయి. భాషకూడా యాస లేదు. అప్రయత్నంగా దారిపొడుగునా ఆ రిక్షా గురించీ, అతని గురించి ఆరా తీసాడు జగన్నాథం.. బ్యాంకులు యిప్పుడు పేదవాళ్లకి ఎన్నెన్ని చేస్తున్నాయి? అని ఆశ్చర్యపోయాడు కాని అంతకంటే ఆశ్చర్యం కలిగింది - ఆ రిక్షా అబ్బాయి చెప్పాడు - అతను పి.యూ.సి. పరీక్ష ప్యాసైనాడు...

"అయితే రిక్షా తొక్కుతున్నావెందుకు? అన్న ప్రశ్న వేసిన జగన్నాథం రిక్షా అబ్బాయి జవాబుకి ' సిగ్గుపడ్డాడు.

"డిగ్నిటీ ఆఫ్ లేబర్" కేవలం ఒక్క నినాదమేనా? యీ దేశంలో గుమాస్తాలు, ఆఫీసర్లు, ఆఫీసులు మాత్రమేనా? విద్యకి సరిహద్దులు? ... తతిమ్మా జాతికి విద్య వద్దా?"

జగన్నాథం స్టేషనుకు చేరుకొనేసరికి రైలు వచ్చి తిరిగి వెళ్లి పోయింది- బామ్మర్ది కృష్ణ మూర్తి ఎదురైనాడు.

"ఏం బావగారూ! రైళ్లు వేళకి నడుస్తున్నాయి కదా! ఆ సంగతి మీదాకా రాలేదా?" అంటూ

పలకరించాడు.

ఇంటికి చేరుకొన్నారిద్దరూ.

సరస్వతమ్మ తమ్ముణ్ణి కుశల ప్రశ్నలు వేసి యిద్దరికీ కాఫీ అందించింది.

"ఏమయ్యా? మూర్తీ! మళ్ళీ సంబంధం చూడ్డానికేనా, వచ్చావు?" అన్నాడు నవ్వుతూ బావగారు.

"మీరు కొత్తగా దిగిన యీ ఇల్లు బాగుంది....' అన్నాడు బామ్మరిది కృష్ణమూర్తి.

"నామాటకి ముందు జవాబు చెప్పు" అన్నాడు జగన్నాథం

"మా అక్కయ్య పోలిక వచ్చింది... నీ మేనల్లుడికి"-అన్నాడు మూర్తి.

"ఏమిట్రా అట్లా అంటున్నావు..."

"ఏముంది! వాడుకట్నం తీసుకోడట! అలా అని ప్రతిజ్ఞ కూడా చేశాడు" కృష్ణ మూర్తి" కొంచెం బాధగా చెప్పాడు.

"ప్చ్...ప్చ్... పాపం! మీకు వో కొన్ని వేలైనా లాస్... ఏరా తమ్ముడూ!" అంది సరస్వతమ్మ.

"ఇంతకీ చెప్పవోయ్ అసలు సంగతి వుద్యోగంలో స్థిరపడ్డాడా? పోనీ" అన్నాడు జెగన్నాథం...

"ఏమిటో బావా వాడంతా మారిపోయాడు ఏవో ఉద్యోగాలొస్తున్నాయి, వెళ్తున్నాడు యింటర్వ్యూలకి... వొస్తున్నాడు.. యీ మధ్య సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంటు స్కీము అని వచ్చిందిగా... దానికి వీడి సపోర్టు ... గవర్నమెంటు లోనుకి అప్లయి చేశాడు... యిప్పుడు..."

"శుభం. నిజంగా ఎంత అదృష్టవంతుడివిరా! మూర్తీ! మారుతున్న కాలానికి అభ్యుదయానికి తగినవాడ్నీ కని పెంచావ్" అంటూ అభినందించాడు జెగన్నాథం. ఇందాక మనల్ని రిక్షాలో తీసుకు వచ్చాడే... ఆ అబ్బాయి.. అతను కూడా ఎడ్యుకేటెడ్ తెలుసా"? అన్నాడు.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు "మన రామం కూడా ప్రింటింగ్ ప్రెస్‌లో అప్రంటీసుగా చేరతాడటండీ' ' అంది సరస్వతమ్మ.

"పోనీలే! చదువుకు ఆడంబరమైన ఉద్యోగాలకూ ముడి పెట్టుకు కూర్చోకుండా మన కుర్రాళ్లలో కొంతమంది ఐనా ముందుకొస్తున్నారు" అంటూ వాళ్లు మాట్లాడుకున్నారు.

కూతరు కల్పన కూడా ఫ్రెండ్సు యింటి నుండి వచ్చింది. రామం, కల్పన, జెగన్నాథం, కృష్ణమూర్తి అంతా భోజనాలకి కూర్చున్నారు. సరస్వతమ్మ వడ్డిస్తున్నది.

"మన పనిపిల్ల నాంచారి... దాని తండ్రికి ప్రభుత్వంవారు యిల్లు కట్టుకుందికి జాగా యిచ్చార్ట... దాని మొహం చూడాలి నిజంగా దీపంలా వెలిగి పోతోంది" - అన్నదామె.

"పోన్లే! కూడూ, గూడూ లాంటి కనీస అవసరాలైనా అందరికీ దొరికే కాలానికి నాందీ ప్రస్తావన

జరుగుతోంది దేశంలో" అన్నాడు జగన్నాథం.

"అద్సరిలే బావా! యీ కల్పన నెవరికైనా వో కుర్రాడికి కాళ్లు కడిగి యిస్తావా? యివ్వవా?" అన్నాడు మాట మారుస్తూ మూర్తి.

"వారేవా! మావయ్యా! నువ్వేమో మీ అబ్బాయిని మార్కెట్‌లో పెట్టేవు. నన్నేమో కొనమని అడుగుతున్నావు. అంతేగా?" అన్నాడు రామం.

"ఛా! ఛా! ఏం మాటల్రా అవీ అంతరం ఎంచకుండా" అంది సరస్వతమ్మ.

"అననీవమ్మా! పడ్డ వారెప్పుడూ చెడ్డవారు కారులే! వాడికింకా తెలియదులే అసలు సంగతి'. అంటూ సర్దబోయాడు మూర్తి.

ఈ సారి ఆశ్చర్యపోడం సరస్వతమ్మ వంతయింది.

కల్పన మాట కలిపింది. "అదేమిటి మామయ్యా? అసలు సంగతి అంటున్నావ్" అంటూ.

"ఏముందే కోడలా! నీ ముక్కుకు త్రాడువేసే రోజులు వచ్చాయి అంటున్నాను" అన్నాడుమూర్తి

ఛీ! పో మామయ్యా! అంటూ సిగ్గుపడిపోయింది కల్పన.

మూర్తిని మందలిస్తున్నట్లు అన్నాడు జెగన్నాథం - "పోనీ లేరా! మరీ తీసిపారేయకు మమ్మల్ని - మీ అప్పునినే కట్టుకోలే-అట్లాగే నా కన్నతల్లి కల్పన-దానికీ వోగంతకు తగ్గ బొంత రాకపోదులే" అని కాని వెంటనే వేలకు వేలుకట్నాలు యివ్వలేని తన బలహీనతను గుర్తెరిగినట్లు "అనవసరంగా పెద్ద చదువులు కూడా చెప్పించేసేను. యిక దానికి ఓ ఉద్యోగం వెతకాలి అంతే" నన్నాడు. కల్పన. బి.ఏ. ప్యాసైంది మరి. కృష్ణమూర్తి నవ్వేడు.

"బావా! యిందాకలే నువ్వు చెప్పేవు ఆడపిల్లల్ని కన్న వాళ్ల కథలు ట్రాజడీలే కానక్కరలేదు - కామెడీలు కూడా అవ్వొచ్చునని... ఔనా?" అడిగాడు సూటిగా మూర్తి బావగారి కళ్లలోకి చూస్తూ.

"ఔను, కాని అది మనకథే అవాలనేముంది?"-నవ్వింది నిర్లిప్తంగా సరస్వతమ్మ.

"ఎందుక్కాకూడదూ? అక్కా! నీ ముక్కు గుద్ది పుట్టాడు నీ మేనల్లుడు. వాడి సంస్కారం నా కళ్లు తెరిపించింది. అందుకే నేనే యీ సంఘంలో బావ కలలు గంటున్న కొత్త కథకి నాందీ వాచకం పలుకుతాను" - అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటో! మామయ్య పొదుపుకథలు చెప్తున్నాడు-" అంటూ కల్పన కల్పించుకుంది.

"కాదే కోడలా సిద్ధాన్నం ముందు చెప్తున్నా... బావా! అక్కా! నువ్వుకూడా విను -రామం ఈ కల్పనను కట్నం లేకుండా మా అబ్బాయికి నేనుచేసుకుంటాను. సరేనా?" అన్నాడు మూర్తి.

ఈ మాటలకి క్షణం సేపు అంతా అవాక్కాయి పోయారు!

సరస్వతమ్మ సంతోషంగా అన్నది - "విన్నావురా రామం! నా కోడలుకూడా - అది ఎక్కడ పుట్టి

పెరుగుతున్నదోకానీ యీ యింటికి రూపాయలను గాక సుగుణ సంపదను మాత్రం కట్నాలుగా తీసుకొస్తుంది".

ఆ మాటకు కృష్ణమూర్తి వెంటనే "శుభం" అన్నాడు.

"థాంక్స్ రా మూర్తీ! నిజంగా నీకొడుక్కిసంబంధం కోసం మాయింటికే వస్తావని కలలోనైనా అనుకోలేదు నేను.. కాని ఒక్కమాట మీ యావిడకి కూడా చెప్పు... పేదవాణ్ని అయినా లాంఛనాలతోనే నా పిల్లని..."

"ఇష్షు! యిది కొత్తకథ. అలాంటి మాటలనకు. దీనిలో మనమంతా పాత్రధారులమే! నా భార్య కూడా".

"మామయ్యా! నేనుకూడా ఓ చిన్నకాటేజ్ యిండస్ట్రీని స్టార్ట్ చేద్దామనుకుంటున్నాను" అన్నాడు రామం ఆనందంగా.

"శుభం" అన్నారు కల్పనతో సహా అంతా.

"దేనికి? నీ పెళ్లికేనా? అన్నాడు అన్న చెల్లిని మేలమాడుతూ! "ఛీ! పో అన్నయ్యా' అంటూ కల్పన సిగ్గు దొంతర్ల మధ్య అడుగులు తడబడగా లోపలి గదిలోకి పారిపోయింది.

నిజంగా ఎంత అదృష్టవంతుణ్ని అంటూ మంచినీళ్ల గ్లాసు తీసుకు త్రాగుతూ పొలకమారి ఉక్కిరి బిక్కిరి ఐపోయాడు జగన్నాథం తెలివొచ్చింది-

"అబ్బా! యిది కలా? ఎంతకమ్మగా వుందీ" అంటూ విస్తుబోయాడు.నిట్టూర్చాడు

**(1977యోజన)**